క్లుప్తంగా

వనిత విజయం ఖాయం


ఎంపీ మిథున్‌రెడ్డితో రాజబాబు, జ్యోతి శ్రీనివాస్‌లు

ద్వారకాతిరుమల: వైఎస్సార్‌ సీపీ ఉభయ గోదావరి జిల్లాల రీజనల్‌ కోఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ చెలికాని రాజబాబు, పార్టీ నేత పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్‌ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ద్వారకాతిరుమల మండలంలోని రాజకీయ పరిస్థితులను మిథున్‌రెడ్డికి వివరించినట్టు రాజబాబు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో గోపాలపురం ఎమ్మెల్యేగా తానేటి వనిత విజయ ఢంకా మోగించడం ఖాయమని వివరించినట్లు చెప్పారు.

కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ


108 కలశాలతో నిర్వహిస్తున్న శోభాయాత్ర

బుట్టాయగూడెం: రెడ్డిగణపవరంలో బుధవారం కనకదుర్గమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రామాలయం నుంచి అమ్మవారి ఆలయం వరకూ 108 కలశాలతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం బ్రహ్మశ్రీ గరిమెళ్ళ వెంకటరమణ సిద్ధాంతి పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గద్దే శ్రీనివాసరావు, రామచంద్రరావు, అల్లూరి సోమేశ్వరరావు, రత్నాజీరావు, పుసులూరి రాంబాబు, శ్రీనివాసరావు, యాదాల సురేష్‌ దంపతులు, ఆలయ ధర్మకర్త భౌమరాజు సర్యనారాయణరాజు, ధనుంజయరాజు తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి


టి.నరసాపురం: గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆప్రో సంస్థ కోఆర్డినేటర్‌ నాగరాజు తెలిపారు. వల్లంపట్ల పంచాయతీలోని తిరుపతిపాడు గ్రామంలో మేండలీజ్‌ కంపెనీ సహకారంతో ఆప్రో సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏలూరు గుడ్‌ సమారిటన్‌ కేన్సర్‌ హాస్పిటల్‌ వైద్య బృందంచే ఉచిత వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు వినీల్, చందు తమ వైద్య బృందంతో 200 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆప్రో సంస్థ సిబ్బంది రాజేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

మదనగోపాల స్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం


బండిక వంశీయురాలిని సన్మానిస్తున్న పాలకవర్గ సభ్యులు

కొయ్యలగూడెం: శ్రీరుక్మిణీ సత్యభామ సమేత మదనగోపాల స్వామి ఆలయ వార్షికోత్సవ సహిత పాంచాహ్నిక బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. పాలకవర్గ అధ్యక్షుడు మద్దు గోపి, విశాలాక్షి దంపతులతో సహా భక్తులు పసుపు కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం స్వామివారిని పెండ్లి కుమారుడిగా, దేవేరులను పెండ్లి కుమార్తెలుగా అలంకరించారు. ఆలయ నిర్మాణ పూర్వీక వంశస్తులైన బండిక వెంకటలక్ష్మిని వేద ఆశీర్వచనాలతో ఘనంగా సత్కరించి నూతన వస్త్రాలు సమర్పించారు. సాయంత్రం నుంచి స్వామివారికి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీమాన్‌ శ్రీనివాసుల శేషాచార్యులు, లక్ష్మీనారాయణ పార్థసారథి, అర్చకులు గుడిపూడి శేషాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పోలీసుల కవాతు


డీఎస్పీ, పోలీస్, సాయుధ దళాల కవాతు

జంగారెడ్డిగూడెం రూరల్: ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర అన్నారు. మండలంలోని శ్రీనివాసపురం, మైసన్నగూడెం గ్రామాల్లో 70 మంది సాయుధ దళాలు, పోలీస్‌ సిబ్బంది కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును నిర్భయంగా, పక్షపాతం లేకుండా వినియోగించుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎన్నికల పరిశీలకులు ప్రతి విషయాన్ని గమనిస్తూ ఉంటారని, ఎన్నికల నిబంధనలను అనుగుణంగా నడుచుకోవాలన్నారు. సీఐ రాజేష్, ఎస్సై జ్యోతిబాస్‌ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

జంగారెడ్డిగూడెం రూరల్: లక్కవరంలో పేకాట స్థావరంపై బుధవారం ఎస్సై సుధీర్‌ తన సిబ్బందితో దాడులు చేపట్టారు. 5గురిని అరెస్ట్‌ చేసి వారి వద్ద నుంచి 1850 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

ఏజెన్సీ రైతుల వరప్రదాయిని.. అగ్రి ల్యాబ్‌

- పశువుల పాలిట గోవర్ధనగిరి అంటూ ప్రజల కితాబు
- రైతుల అవసరాలకు అనుగుణంగా సేవలు


కొయ్యలగూడెంలోని డాక్టర్‌ వైఎస్సార్‌ అగ్రి టెస్టింగ్‌ ల్యాబ్‌ సెంటర్‌


అగ్రి టెస్టింగ్‌ ల్యాబ్‌ సెంటర్లో పరీక్షలు నిర్వహిస్తున్న టెక్నీషియన్‌

కొయ్యలగూడెం: ఏజెన్సీ మెట్ట ప్రాంత రైతులకు, పశు పెంపకందారులకు వరప్రదాయినిగా డాక్టర్‌ వైఎస్సార్‌ అగ్రి టెస్టింగ్‌ ల్యాబ్‌ సెంటర్‌ సేవలందిస్తోంది. రైతుల అవసరాలకు అనుగుణంగా వ్యవసాయ పరీక్షలు నిర్వహించుకోవడానికి అదేవిధంగా రైతుకు ప్రధాన వనరుగా ఉండే పశువుల సంరక్షణకు అగ్రి టెస్టింగ్‌ ల్యాబ్‌ సేవలు నిర్వహిస్తూ రైతుల మన్ననలను పొందగలుగుతూ వస్తుంది. వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరానికి పోలవరం నియోజకవర్గ కేంద్రంగా ఉన్న కొయ్యలగూడెంలో అగ్రి టెస్టింగ్‌ ల్యాబ్‌ సెంటర్‌ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు చొరవతో మంజూరైంది. అయితే కరోనా విపత్కర పరిస్థితిలో రెండేళ్లపాటు ఏర్పడిన అడ్డంకులను ఒక్కొక్కటి అధిగమిస్తూ రూ.64 లక్షల వ్యయంతో నిర్మాణం పూర్తి చేసుకుంది. ఏఎంసీ యార్డులో 2023 జూలై 8న మహానేత వైఎస్సార్‌ జయంతి సందర్భంగా రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభమై గత 8 నెలలుగా నిర్విరామంగా సేవలందిస్తూ ల్యాబ్‌ ప్రత్యేకత చాటుకుంటూ వస్తోంది.

అగ్రి ల్యాబ్‌లో సేవలు ఇలా..

అగ్రి టెస్టింగ్‌ ల్యాబ్‌ ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యత పరీక్షలు నిర్వహించుకోవడంతో పాటు పశువులకు సంబంధించి రక్త పరీక్షలు, యూరిన్, వీర్యం, పేడ, సీరం, స్కిన్, నాజల్‌ టెస్టులతో పాటు పాల సాంద్రతతో సహా మొత్తం 70 రకాల పరీక్షలను నిర్వహిస్తారు. నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందుల బెడద లేకుండా సుమారు గతేడాది నుంచి రైతులు తమ పంటలను నాణ్యమైన రీతిలో ఉత్పత్తి చేసుకోగలుగుతున్నారు. అదేవిధంగా పశువులను సకాలంలో వాటికి సోకిన వ్యాధులను గుర్తించి కాపాడుకోగలుగుతున్నారు. నియోజకవర్గంలోని కొయ్యలగూడెం, బుట్టాయిగూడెం, పోలవరం, వేలేరుపాడు, కుకునూరు, జీలుగుమిల్లి మండల రైతులకు, పశు పెంపకందారులకు అగ్రి టెస్టింగ్‌ ల్యాబ్‌ వలన కలిగిన ప్రయోజనంతో తాము ఆర్థికంగా నిలదొక్కుకోగలిగామని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి మూడు నుంచి ఆరు నెలలకు ఓసారి భూసార పరీక్షలతో పాటు పశు పరీక్షలు నిర్వహించుకునే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నట్లు పశు వర్ధక శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పశు సంరక్షణ కోసం ప్రవేశపెట్టిన ''1962' కాల్‌ సెంటర్‌ ద్వారా సకాలంలో పశువులకు అంబులెన్స్‌ పంపించడంతోపాటు వాటికి సకాలంలో ఆరోగ్య సేవలను అందించే గోవర్ధనగిరిగా మారింది అని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సేవలు పొందగోరు వారు పశుసంవర్ధక శాఖ లేదా వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదిస్తే వారు సూచించిన విధంగా ల్యాబ్‌ సెంటర్‌కి నమూనాలను తీసుకు రావాల్సి ఉంటుంది. అనంతరం పరీక్షలు నిర్వహించి రిపోర్టు అందజేస్తూ పంట లేదా భూమి, పశువులకు సంబంధించి రక్షిత సలహాలను సూచనలను అందించడం జరుగుతుంది. మెరుగైన పరీక్షలు అవసరమైతే వాటిని జిల్లా కేంద్రంలోని ఏలూరు టెస్టింగ్‌ ల్యాబ్‌కు పంపించడంతోపాటు రిపోర్టులను ఇందుకు సంబంధించిన వారికి అందజేస్తున్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగిస్తూ అగ్రి టెస్టింగ్‌ ల్యాబ్‌ రైతు సేవలో ముందుకు కొనసాగుతోంది.

నియోజకవర్గానికి ఒకటి చొప్పన



దేశంలోనే మొట్టమొదటిసారిగా వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున రాష్ట్రవ్యాప్తంగా అగ్రి టెస్టింగ్‌ ల్యాబ్‌లను ఏర్పాటు చేయడం జరిగింది. అంతకుముందు జిల్లా కేంద్రంలోని అగ్రి ల్యాబ్‌కి వెళ్లి పరీక్షలు చేసుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవి.
– గేలం త్రివిక్రమ సోమరాజు, సర్పంచుల ఛాంబర్‌ పోలవరం నియోజకవర్గ అధ్యక్షుడు

నకిలీ మాట లేదు



గతంలో వరి వంగడాలలో కేలీ విత్తనాలు అదేవిధంగా మొక్కజొన్నలో నకిలీ విత్తనాలు రావడంతో తీవ్రంగా నష్టపోయే వాళ్లం. దాదాపు సంవత్సరం నుంచి వ్యవసాయానికి సంబంధించి మెట్ట ప్రాంతంలో నకిలీ అనే మాట వినపడకుండా పోయింది.
– గంజి ధనకోటరెడ్డి, రైతు, వేదాంతపురం

ప్రపంచ పిచ్చుకల దినోత్సవం


ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా కళాశాలలో ప్రసంగిస్తున్న అధ్యాపకులు

జంగారెడ్డిగూడెం: స్థానిక ఛత్రపతి శివాజీ త్రిశత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఎస్‌.ప్రసాద్‌బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ మాట్లాడుతూ పిచ్చుకలను కాపాడుకోవడం, పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం మన అందరి బాధ్యత అన్నారు. జువాలజీ విభాగం ఆర్‌.విజయ దీపిక మాట్లాడుతూ ఎక్కువ రేడియేషన్‌ వలన పిచ్చుకలు అంతరించిపోతున్నాయని, రేడియేషన్‌ తగ్గించడం వల్ల పిచ్చుకలను కాపాడుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్‌ ప్రిన్సిపాల్‌ బి.శ్రీనివాసరావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్‌ ఎం. మధు, అధ్యాపకులు సీహెచ్‌ బద్రీ నారాయణ, టి.యూస్సీరాణి, సీహెచ్‌.వెంకటలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

వంట షెడ్డు ప్రారంభం


జంగారెడ్డిగూడెం ఉర్దూ పాఠశాలలో వంట షెడ్డును ప్రారంభిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: మానవత ఆధ్వర్యంలో బుధవారం వంట షెడ్డు ప్రారంభించారు. స్థానిక పాత బస్టాండ్‌ వద్ద ఉన్న ఉర్దూ స్కూల్లో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వారు వంట షెడ్డును నిర్మించారు. ఈ షెడ్డును ఆ సంస్థ సెంట్రల్‌ కమిటీ డైరెక్టర్‌ మహంకాళి రంగ ప్రసాద్‌ ప్రారంభించినట్లు అధ్యక్షుడు దల్లి కేదారేశ్వరరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఉర్దూ పాఠశాల నిర్వాహకులు మానవత సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేయాలి


పీఓ సూర్యతేజ

బుట్టాయగూడెం: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని నిష్పక్షపాతంగా, కట్టుదిట్టంగా అమలు చేయాలని ఐటీడీఏ పీఓ, పోలవరం ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి ఎం. సూర్యతేజ ఆదేశించారు. బుధవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో పోలవరం నియోజకవర్గ స్థాయి ఎంసీసీ, ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ బృందాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును ప్రతిరోజూ పర్యవేక్షిస్తూ ఎక్కడా ఉల్లంఘనకు తావులేకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓలు, పోలీస్‌శాఖ ఇంజినీరింగ్, ఐటీడీఏ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

సోషల్‌ మీడియాతో జర జాగ్రత్త

బుట్టాయగూడెం: త్వరలో జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్‌ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిబంధనలను అమలు చేయడంలో భాగంగా సోషల్‌ మీడియాపై ఈసీ ప్రత్యేక దృష్టి సారించింది. ప్రింట్, ఎలక్ట్రానిక్‌ మీడియాల్లో వచ్చే కథనాలు, వార్తలపైనే కాకుండా సోషల్‌ మీడియాలో జరిగే చర్చలు, పోస్టులను నిశితంగా పరిశీలిస్తోంది. చాలా వాట్సాప్‌ గ్రూపుల్లో ఎన్నికలకు సంబంధించిన, అభ్యర్థుల ఎంపికకు సంబంధించి, సీట్ల కోసం వెంపర్లాడుతూ పార్టీలు మారుతున్న విషయాలపై కొందరు బాహాటంగానే చర్చిస్తున్నారు. ఎవరికి తోచిన విధంగా వారు పోస్టులు పెడుతున్నారు. ప్రచారానికి సంబంధించి, రెచ్చగొట్టే వ్యాఖ్యలపై ఎన్నికల సంఘం నిఘా పెట్టింది. ఎన్నికల కోడ్‌ అమలులో ఉన్నందున అడ్డగోలు వ్యాఖ్యలు పెట్టొద్దని గ్రూపు అడ్మిన్లు సూచిస్తున్నా అర్థం చేసుకోకుండా కొందరు అదే పనిగా తమ భావాలను వ్యక్తీకరిస్తున్నారు. కొందరు అడ్మిన్లు అప్రమత్తంగా ఉండి వాటిని డిలీట్‌ చేస్తున్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తప్పవు. వాట్సప్‌ గ్రూపుల్లో పోస్టులు పెట్టే వారు జాగ్రత్తగా ఉండాలని అటు ఎన్నికల అధికారులు, ఇటు పోలీసులు హెచ్చరిస్తున్నారు.

వైఎస్సార్‌ సీపీ శ్రేణులు.. సైనికుల్లా పనిచేయాలి

- చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు
- జంగారెడ్డిగూడెం మండలంలో విస్తృత పర్యటన


నిమ్మలగూడెంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి విజయరాజు

జంగారెడ్డిగూడెం రూరల్: చింతలపూడి నియోజకవర్గంలో వైఎస్సార్‌ సీపీని గెలిపించుకోవడంతో పాటు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని ఆ పార్టీ చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. జంగారెడ్డిగూడెం మండలంలో కట్టవపొదలవారిగూడెం, అమ్మపాలెం, నిమ్మలగూడెం, టిక్కినవారిగూడెం, లక్కవరం గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. పార్టీ శ్రేణులను, ప్రజలను కలిశారు. దివంగత నేత వైఎస్‌ రాజశేఖరరెడ్డి, అంబేడ్కర్‌ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆలయాలు, చర్చిలను దర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తొలుత మహిళలు హారతులు పట్టి ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం విజయరాజు మాట్లాడుతూ తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధిలో నంబర్‌ –1 స్థానంలో తీసుకెళతానన్నారు. సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తూ వచ్చారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రస్తుత ప్రభుత్వం సంక్షేమ పథకాలు చేరువయ్యాయన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో చింతలపూడి నియోజకవర్గాన్ని గెలిపించుకుని ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, వైఎస్సార్‌ సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, సర్పంచ్‌లు సూరవరపు రాంబాబు, గెల్లా వెంకటరమణ, మణికె వెంకటలక్ష్మి, ఎంపీటీసీ తానిగడప నిర్మలకుమారి, సచివాలయాల మండల కన్వీనర్‌ గురజాల పార్థసారథి, నాయకులు మళ్ళీడి బాబి, రాఘవరాజు ఆదివిష్ణు, మణికె సత్యనారాయణ, తానిగడప రామకృష్ణ, దల్లి నాగేశ్వరరావు, ముప్పిడి శ్రీనివాసరావు, కేవీ సత్యనారాయణ, పత్తి వీరాస్వామి, గాది నాగేశ్వరరావు, కనపర్తి రాజేష్, ముప్పిడి అంజి, పల్లా గంగాధరరావు, గంజి వినోద్, శీలం కృష్ణంరాజు, నిమ్మ గురునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భట్టువారిగూడెంలో ఇంటింటి ప్రచారం


మేము సిద్ధం.. మా బూత్‌ సిద్ధం కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌ సీపీ నాయకులు

చింతలపూడి: చింతలపూడి నగర పంచాయతీ పరిధిలోని భట్టువారిగూడెంలో బుధవారం బూత్‌ కన్వీనర్‌ బి చెంచమరాజు ఆధ్వర్యంలో మేము సిద్ధం.. మా బూత్‌ సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ తిరిగి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజులను అత్యధిక మెజార్టీతో గెలిపించి మరోసారి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ బూత్‌ కన్వీనర్‌ వెంపా కృష్ణ, సచివాలయాల కన్వీనర్, ఎం.దుర్గారావు, మండల విద్యార్థి విభాగం కన్వీనర్‌ ఎం.దిలీప్, ఎస్సీ సెల్‌ జాయింట్‌ సెక్రటరీ ఎస్‌ కాంతారావు, కొత్తపల్లి మోహన్, కొప్పుల సాయి, కపిలవాయి రామరాజు, సరికొండ అప్పలరాజు, కె ప్రసాద్‌రాజు, బొడ్డేటి రాము, వైఎస్సార్‌ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటమి భయంతో టీడీపీ అనుచిత వ్యాఖ్యలు


కామవరపుకోట వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రమేష్, పార్టీ శ్రేణులు

కామవరపుకోట: ఓటమి భయంతో టీడీపీ నేతలు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని వైఎస్సార్‌ సీపీ నాయకులు ఎద్దేవా చేశారు. స్థానిక వైఎస్సార్‌ సీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జెడ్పీటీసీ రమేష్‌ మాట్లాడుతూ టీడీపీ నేత ఘంటా మురళి, ఆ పార్టీ నాయకుల వ్యాఖ్యలను ఖండించారు. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలు తెలుసుకుంటూ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా మండల ప్రజలకు 1000 కోట్లు పైబడి లబ్ధిదారుల ఖాతాలో నగదు జమచేసిందన్నారు. అంతేకాకుండా నాడు–నేడు ద్వారా రూ.18 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, రూ.8.50 కోట్లతో సీసీ రోడ్లు, రూ.2 కోట్లతో జిల్లా పరిషత్‌ రోడ్లు, రూ.6 కోట్లతో గ్రామ సచివాలయాలు, రూ.3.48 కోట్లతో రైతు భరోసా కేంద్రాలు, రూ.2.27 కోట్లతో వైఎస్సార్‌ హెల్త్‌ క్లినిక్‌ సెంట్రల్‌ భవనాలు నిర్మించి ప్రతి గ్రామంలో సేవలు అందిస్తుంటే టీడీపీ నేతలు ఆత్మ విమర్శ చేసుకోకుండా, మండలంలో అభివృద్ధి లేదని, ఎంపీ శ్రీధర్‌ అందుబాటులో లేరని విమర్శించడం తగదన్నారు. వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ మిడతా రమేష్‌ బాబు మాట్లాడుతూ ఎంపీ శ్రీధర్‌ కుటుంబ సభ్యులు పార్టీ మారే ప్రసక్తే లేదని, ఎంపీ శ్రీధర్‌ సోదరి పొన్నాల అనిత నియోజకవర్గంలో ఉంటూ వైఎస్సార్‌ సీపీ గెలుపు కోసం నిరంతరం కృషి చేస్తున్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్‌ నాయకులు, ఉప సర్పంచ్‌ మేడూరి రంగబాబు,, సొసైటీ చైర్మన్‌ సాయన కనకరాజు, వైస్‌ ఎంపీపీ తమ్మిశెట్టి గిరిజ, ఎంపీటీసీలు బొల్లు వెంకట సత్యనారాయణ, కనుమూరు అంజిరెడ్డి, రాష్ట్ర ముదిరాజ్‌ డైరెక్టర్‌ చిక్కుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సాయం



విద్యార్థులు సేకరించిన నగదును పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి అందిస్తున్న దృశ్యం

కుక్కునూరు: ప్రమాదవశాత్తు తలకు గాయమై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పూర్వ విద్యార్థికి చికిత్స నిమిత్తం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఆర్థిక సాయం అందించారు. వివరాల ప్రకారం.. మండలంలోని గుంపెనపల్లి గ్రామానికి చెందిన వేముల శివాజీ అమరవరం హైస్కూల్‌లో 2018–19లో పదో తరగతి పూర్తి చేశాడు. కాగా ఇటీవల ప్రమాదవశాత్తు క్రిందపడడంతో అతని తలలో రక్తం గడ్డకట్టి ఆపరేషన్‌ చేయాల్సి ఉందని వైద్యులు చెప్పారు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో శివాజీ మిత్రులు ఆర్థిక సాయం కోసం పాఠశాలను ఆశ్రయించారు. దీంతో విద్యార్థులు తమ వంతు సాయంగా రూ.16 వేలు నగదు సేకరించి ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ చేతుల మీదుగా శివాజీ మిత్రులకు అందించారు.

సమష్టిగా పనిచేద్దాం.. వైఎస్సార్‌ సీపీని గెలిపిద్దాం

- జీలుగుమిల్లిలో వైఎస్సార్‌ సీపీ పోలవరం అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి పరిచయ కార్యక్రమం


జీలుగుమిల్లిలో కార్యకర్తలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న రాజ్యలక్ష్మి

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): నియోజకవర్గంలోని ప్రజలందరికీ అందుబాటులోనే ఉంటానని అంకిత భావంతో పనిచేస్తూ మంచిపేరు తెచ్చుకుంటానని వైఎస్సార్‌ సీపీ పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి అన్నారు. జీలుగుమిల్లిలోని 12 పంచాయతీలకు సంబంధించిన ముఖ్య నాయకులు, కార్యకర్తలతో బుధవారం అభ్యర్థి రాజ్యలక్ష్మి పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలు విన్న రాజ్యలక్ష్మి మాట్లాడుతూ గడచిన ఐదేళ్ల వైఎస్సార్‌ సీపీ పాలనలో మూడేళ్లు కరోనా ప్రభావం అతలాకుతలం చేసిందని అన్నారు. అయినప్పటికీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఏ ఒక్క పథకాన్ని ఆపకుండా ప్రజలకు అందించేందుకు కృషి చేశారని చెప్పారు. గతంలో తన భర్త ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు ఓటు వేసి గెలిపించారని, అదే అభిమానాన్ని తనపై కూడా ఉంచాలని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ అభివృద్ధికి తాను కూడా కృషి చేస్తానని అన్నారు. సమన్వయంతో అందరూ కలసికట్టుగా పనిచేద్దామని అన్నారు. పోలవరం గెలుపును సీఎం జగనన్నకు బహుమతిగా ఇద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మల్లం వసంతరావు, ఎంపీపీ కోర్సా పోచమ్మ, పార్టీ మండల కన్వీనర్‌ చందా ప్రసాద్, వైస్‌ ఎంపీపీ సోమగాని శ్రీను, సొసైటీ అధ్యక్షుడు బోదా శ్రీనివాసరెడ్డి, నాయకులు గూడవల్లి శ్రీనివాస్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

జగదాంబ అమ్మవారిని దర్శించుకున్న రాజ్యలక్ష్మి

జీలుగుమిల్లిలో కొలువై పూజలందుకుంటున్న జగదాంబ అమ్మవారిని బుధవారం వైఎస్సార్‌ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి దర్శించుకున్నారు. ప్రస్తుతం అమ్మవారి ఉత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో ఆలయ కమిటీ చైర్మన్‌ కక్కిరాల రాము ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు కలశంతో స్వాగతం పలికారు. అమ్మవారికి రాజ్యలక్ష్మి ప్రత్యేక పూజలు చేశారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

పోలవరం రూరల్: వేసవికాలంలో ఎక్కడా నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల పరిషత్‌ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండి ఎక్కడైనా గ్రామాల్లో మంచినీటి పథకాలు, బోర్లు మరమ్మతులకు గురైతే వెంటనే వాటిని బాగుచేసి ప్రజల దాహార్తిని తీర్చాలన్నారు. అలాగే విద్యుత్‌ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్‌ శాఖాధికారులకు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించి వైఎస్సార్‌ చేయూత, ఆసరా పథకాలకు సంబంధించిన సొమ్ము మహిళల ఖాతాల్లో త్వరలో జమ అవుతుందన్నారు. ఈ పథకాలకు ఎలక్షన్‌ కోడ్‌కు సంబంధం ఉండదని పేర్కొన్నారు. ఎంపీడీవో జి.శ్రీను, వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌ దత్తి రాంబాబు, ఈవో పీఆర్‌డీ శ్రీనివాసరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో 16 గొర్రెల మృతి

కుక్కునూరు: అనుమానాస్పద స్థితిలో గొర్రెలు మృతి చెందిన ఘటన బుధవారం కుక్కునూరు గ్రామ సమీపంలోని గుండేటివాగు వద్ద జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి, తూర్పుగోదావరి జిల్లా, గోపాలపురం గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు గత కొన్నిరోజులుగా మూడు వందలకు పైగా గొర్రెలను తీసుకొచ్చి మండలంలోని వివిధ ప్రాంతాలలో మేపుతున్నారు. కాగా బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఉన్నట్టుండి మందలోని 16 గొర్రెలు మృతి చెందాయి. గొర్రెల మృతికి విద్యుదాఘాతం కారణమని మొదట స్థానికులు భావించారు. అక్కడ విద్యుత్‌ తీగలు ఏమీ లేకపోవడంతో విద్యుదాఘాతం కారణం కాదని విద్యుత్‌ సిబ్బంది తేల్చారు. కాగా గొర్రెలు చేలల్లోని ఏవైనా విషగులికలు తినడంతో మృతి చెంది ఉంటాయని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు.

దేవినేనివారిగూడెంలో శిలువ మార్గం

ద్వారకాతిరుమల: రామన్నగూడెం పంచాయతీ దేవినేనివారిగూడెం ఎస్సీ కాలనీలో ఏసుక్రీస్తు శ్రమల రోజును పురస్కరించుకుని బుధవారం శిలువ మార్గాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నేత పాకలపాటి త్యాగభీమేశ్వరరావు, ఫాదర్‌ డి.నతానియెల్, ఫాదర్‌ శ్రీకాంత్, సిమోన్‌ శ్రీను, కె.రమేష్, బి.ఫ్రాన్సిస్, పి.వెంకటేశ్వరరావు, పి.రంజిత్‌ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే బాలరాజు పర్యటన

కుక్కునూరు: పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు గురువారం మధ్యాహ్నం నుంచి కుక్కునూరు మండలంలో పర్యటించనున్నట్టు వైఎస్సార్‌ సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనంతరం కార్యకర్తలతో సమావేశమై ఎన్నికలకు దిశా నిర్దేశం చేస్తారని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.